క్లుప్తంగా

పేద విద్యార్థికి వారధి ఫౌండేషన్ అండ



దాచేపల్లి: నిరుపేద విద్యార్థిని వారధి ఫౌండేషన్ అండగా నిలిచింది. మండలంలోని శ్రీనగర్‌కి చెందిన పులిపాంగు సాగర్ కుమార్తె శ్రావణి చదువుల నిమిత్తం ఫౌండేషన్ ద్వారా వ్యవస్థాపకులు తగరం ఆనంద్‌కుమార్ రూ.74,500 ఆర్థిక సాయాన్ని ఆదివారం అందజేశారు. శ్రావణి డిప్లమో చదువుకుంటుంది. ఆమె తండ్రి సాగర్ అనారోగ్యంతో ఇటీవల చనిపోయాడు. దీంతో శ్రావణి చదువులకు ఆటంకం కలిగింది. విషయం తెలుసుకున వారధి ఫౌండేషన్ వ్యవస్థాపకుడు తరగం ఆనంద్‌కుమార్ శ్రావణితో మాట్లాడారు. చదువుల కోసం అవసరమైన ఫీజులను చెల్లిస్తామని హామీ ఇచ్చారు. ఈ ఏడాదికి ఫీజుకి సంబంధించి రూ.74,500 ఆర్థికసాయాన్ని నేరుగా కళాశాల యజమాన్యానికి చెల్లించారు. శ్రావణి చదువుల కోసం తమ ఫౌండేషన్ ఎప్పుడు అండగా ఉంటుందని, పేద విద్యార్థుల చదువులకు ఇబ్బందులు కలుగకుండా తమ పౌండేషన్ సహకారం అందిస్తుందని ఆనంద్‌కుమార్ చెప్పారు. కార్యక్రమంలో సభ్యులు వట్టిపు నాగేశ్వరరావు, మస్తాన్‌వలి, మోజెస్, రాజా, సంతోష్, మరియదాసు, ఏసోబు పాల్గొన్నారు.

పట్టణాభివృద్ధికి కృషి

మాచర్ల రూరల్: పట్టణంలోని 7వ వార్డులోని కిడ్స్ పాఠశాల వద్ద రూ.50 లక్షలతో నిర్మించనున్న సిమెంట్ రోడ్డుకు ఎమ్మెల్యే జూలకంటి బ్రహ్మానందరెడ్డి ఆదివారం శంకుస్థాపన చేశారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ మదార్‌సాహెబ్, వైస్ చైర్మన్‌లు పోలూరి నరసింహారావు, యర్రాకుల సిద్దమ్మ, టీడీపీ నాయకులు వై.కేశవరెడ్డి, కొమెర దుర్గారావు, గట్ల కోటిరెడ్డి, కమిషనర్ డి.వేణుబాబు, కేసీపీ సిమెంట్స్ జీఎం వెంకటరమణ, నారాయణ పాల్గొన్నారు.

లబ్ధిదారులకు వ్యాక్యూమ్ ట్రక్కు అందజేత



నరసరావుపేట: జిల్లా షెడ్యూల్ క్యాస్ట్ సర్వీసెస్ కో–ఆపరేటివ్ సొసైటీ నిధులతో మంజూరైన డిసాల్టింగ్ వ్యాక్యూమ్ ట్రక్కును ఆదివారం ఎమ్మెల్యేలు కన్నా లక్ష్మీనారాయణ, డాక్టర్ చదలవాడ అరవిందబాబు లబ్ధిదారులకు అందజేశారు. కార్యక్రమంలో మాల కార్పొరేషన్ చైర్మన్ పెద్దాపూడి విజయ్‌కుమార్, రంగిశెట్టి రామకృష్ణ, కొల్లి బ్రహ్మయ్య, వాసిరెడ్డి రవి, పులిమి రామిరెడ్డి, గూడూరు శేఖర్ పాల్గొన్నారు.

సమానత్వం సాధించడమే ఎమ్మార్పీఎస్ లక్ష్యం

నరసరావుపేట: సామాజిక, ఆర్థిక, రాజకీయ అసమానతలను నిర్మూలించి సమానత్వాన్ని సాధించడమే ఎమ్మార్పీఎస్ ఆశయమని జిల్లా కో–ఇన్‌చార్జి చిరుగూరి నాగరాజు మాదిగ పేర్కొన్నారు. స్థానిక కంభంపాలెంలో ఆదివారం నిర్వహించిన ఎమ్మార్పీఎస్ అనుబంధ సంఘాల సమావేశానికి ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. ఎమ్మార్పీఎస్ 31 ఆవిర్భావ దినోత్సవాన్ని గ్రామగ్రామాన ఘనంగా నిర్వహించాలని సూచించారు. కార్యక్రమంలో ఎంఎస్ఎఫ్ టౌన్ అధ్యక్షులు కలపాల చరణ్ మాదిగ, ప్రధాన కార్యదర్శి బుట్టి మహేంద్ర మాదిగ, ఎమ్మార్పీఎస్ టౌన్ అధ్యక్షులు బూదాల విజయ్ మాదిగ, విద్యార్థి నాయకులు బూదాల కిరణ్ మాదిగ పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరా నిలిపివేత

చిలకలూరిపేట: పోలిరెడ్డిపాలెం ఫీడర్‌లో లైన్ల మరమ్మతులు, చెట్ల కొమ్మలు తొలగింపు సందర్భంగా పట్టణంలోని పలు ప్రాంతాల్లో సోమవారం ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు డీఈఈ ఆర్. అశోక్‌కుమార్ తెలిపారు. పట్టణంలోని పోలిరెడ్డిపాలెం, లక్ష్మీనరసింహ కాలనీ, కోంద్రుపాడు, వైఎస్సార్ కాలనీ, రాజీవ్ గృహకల్ప ప్రాంతాల్లో పైన పేర్కొన్న వేళల్లో సరఫరా ఉండదని ఆయన పేర్కొన్నారు.

ఆర్టీసీ బస్టాండ్‌లో ఫ్యాన్లు ఏర్పాటు

నరసరావుపేట: స్థానిక ఆర్టీసీ బస్టాండ్ ఆవరణలో ఏపీ స్టేట్ ఎనర్జీ కన్జర్వేషన్ మిషన్(ఏపీఎస్ఈసీఎం) సంస్థ ప్రయాణికుల సౌకర్యార్థం ఏడు సీలింగ్ ఫ్యాన్లను ఏర్పాటు చేసిందని డిపో మేనేజర్ బూదాటి శ్రీనివాసరావు ఆదివారం వెల్లడించారు. దీని వల్ల తమకు విద్యుత్ ఆదా అవుతుందని తెలిపారు. బస్టాండ్ ఆవరణలో 30 స్టీల్ బెంచీలు, 12 ఫ్యాన్లు, తాగునీరు, మరుగుదొడ్లు, సీసీ టీవీ కెమెరాలు ఏర్పాటు చేసినట్లు పేర్కొన్నారు. బస్టాండ్‌ను ఎప్పటికప్పుడు ఊడ్చి శుభ్రంగా ఉంచుతున్నామని తెలిపారు. ప్రయాణికులంతా ఆర్టీసీ సంస్థను ఆదరించి బస్సుల్లోనే ప్రయాణించాలని ఆయన కోరారు.

ధాన్యం.. దైన్యం

- ధర లేక ఆందోళనలో అన్నదాతలు
- కౌలు రైతుల పరిస్థితి దారుణం



పాలువాయిలోని ఓ రైతు ఇంట్లో నిల్వ ఉన్న ధాన్యం బస్తాలు

రెంటచింతల: రైతుకు సాయం అందడం లేదు. ధరపై దిగుపట్టుకుంది. పెట్టుబడి సాయం లేక బ్యాంకు చుట్టూ ప్రదక్షిణలు చేస్తున్నారు. అన్నదాతల పరిస్థితి అగమ్యగోచరంగా మారింది. మండలంలో ఈ ఏడాది ఖరీఫ్‌లో 5,864 ఎకరాలలో వరి పంటను సాగుచేశారు. రబీలో సుమారు 4,852 ఎకరాలలో సాగుచేశారు. ఇప్పటికే దిగుబడి తగ్గడంతో పాటు ధర లేకపోవడంతో ఆందోళన చెందుతున్నారు.

సాగుబడి ఇలా..

ఏ ఏటికి ఆ ఏడు తమ తలరాతలు మారకపోతాయా... అనే ఎన్నో ఆశలతో రైతన్నలు ఈ ఏడాది కూడా వరి పంటను సాగు చేశారు. వరి చివరి దశలో సాగునీరు అందని పరిస్థితిలో కూడా అందినకాడికి అప్పుల తెచ్చి కష్ట నష్టాలను ఓర్చి వరి పంట కాపాడుకున్నారు. ఖరీఫ్‌లో వచ్చిన దిగుబడి కౌలు చెల్లించేందుకు, పెట్టుబడులు పెట్టేందుకు తెచ్చిన అప్పులు తీర్చేందుకు సరిపోగా ఎంతో కొంత తమ కష్టానికి ఫలితం దక్కక పోతుందా అనే ఆశతో రబీలో సాగు చేసిన వరి పంట దిగుబడి నామమాత్రంగానే వచ్చింది.

ధర కోసం ఎదురుచూపులు..

మార్చి నెల చివరిలో పంట కోతకోసి తూర్పారపట్టి, వడ్లను బస్తాలను నింపుతున్న సమయంలో 75 కిలోల బస్తా రూ.1,350 నుంచి రూ.1,500 వరకు ఉండగా ప్రస్తుతం రూ.1,600 నుంచి రూ.1,650 వరకు ధర పలుకుతుంది. మూడు నెలలుగా ఇంట్లో ధాన్యం బస్తాలు నిల్వ చేయడం వలన తరుగుదల, వడ్డీతో పాటు ధర కూడా కొంత తగ్గడంతో బస్తాకు రూ.350 వరకు నష్టపోవాల్సిన పరిస్థితి ఏర్పడిందని రైతులు చెబుతున్నారు. దిగుబడి తగ్గడం తోపాటు సరైన గిట్టుబాటు ధర లభించక పోవడంతో రైతన్నలు ఇళ్లలో ధాన్యం బస్తాలను నిల్వచేశారు. జూన్ ప్రారంభమైన ధాన్యం ధర పెరగక పోవడంతో అన్నదాతల మొఖాలలో చిరునవ్వు కనిపించడం లేదు. ఏ రైతుకు కూడా 32 నుంచి 35 బస్తా దిగుబడి మించి రాలేదని ఎక్కడో ఒకరికి మాత్రమే 40 నుంచి 42 బస్తాల దిగుబడి వచ్చిందని పలువురు రైతులు పేర్కొన్నారు. పెట్టుబడులకు తగ్గట్టు ధాన్యం ధరలు పెరగకపోవడంతో పాటు ప్రభుత్వం కూడా ధాన్యానికికు మద్దతు ధర కల్పించక పోవడంతో రైతుల పరిస్థితి దారుణంగా తయారైంది.

ధాన్యాన్ని ప్రభుత్వమే కొనుగోలుచేయాలి



ప్రతి ఒక్కరికి మెతుకు నోటిలోకి పోయేందుకు కష్టపడే రైతన్నల ఆదుకునేందుకు ప్రభుత్వమే పండించిన ధాన్యం కొనుగోలు చేయాలి. ఆరు ఎకరాలు సాగేచేశా. ధర ఆశాజనకంగా లేకపోవడంతో ఇంట్లో 198 బస్తాలు నిల్వచేశా. దిగుబడులు తగ్గడంతో పాటుగిట్టుబాటు ధర లభించకపోవడంతో రైతుల పరిస్థితి దీనంగా తయారైంది. రైతులు పండించిన ధాన్యానికి మద్దతుధర ప్రకటించి ప్రభుత్వమే కొనుగోలు చేయాలి.

–గుంటా శ్రీనివాసరెడ్డి, రైతు, పాలువాయి

ఎకరాకు పది వేలు నష్టపోతున్నాం



రోజురోజుకు ధాన్యం ధరలు తగ్గుముఖం పట్టడంతో ఎకరాకు సుమారు రూ.10 వేల వరకు నష్టపోతున్నాం. ఈ రబీ సీజన్‌లో పది ఎకరాలలో వరి సాగుచేశా. దిగుబడి తగ్గింది. పెట్టిన పెట్టుబడులు కూడా తిరిగివచ్చే పరిస్థితి కనిపించడంలేదు. కష్టపడి పండించిన పంటను బస్తా ధర రూ.1200 వ్యాపారలు నిర్ణయించారు. ఆ ధర గిట్టుబాటు కాకపోవడంతో ఇంట్లో ధాన్యం బస్తాలు నిల్వచేశా.

– తోట కొండలు, రైతు, పాలువాయిగేటు

పార్టీ బలోపేతానికి కృషి చేయండి

మాజీ ఎమ్మెల్యే కాసు మహేష్‌రెడ్డి



గామాలపాడు నాయకులు, కార్యకర్తలతో మాజీ ఎమ్మెల్యే కాసు

దాచేపల్లి: వైఎస్సార్ సీపీ బాలోపేతానికి ప్రతి కార్యకర్త కష్టపడి పనిచేయాలని మాజీ ఎమ్మెల్యే కాసు మహేష్‌రెడ్డి కోరారు. మండలంలోని గామాలపాడులోని పార్టీ ముఖ్యనేతలు, కార్యకర్తలతో ఆదివారం మాట్లాడారు. గ్రామంలో పార్టీ పరిస్థితులతో పాటుగా పార్టీ బలోపేతం కోసం తీసుకోవాల్సిన చర్యలపై చర్చించారు. కష్టపడి పని చేసిన ప్రతి ఒక్కరికి జగన్ 2.0లో తప్పనిసరిగా మేలు జరుగుతుందని, కార్యకర్తలు, నాయకులకు పార్టీ ఎల్లప్పుడు అండగానే ఉంటుందని హామీ ఇచ్చారు. కూటమి చేస్తున్న మోసాలు, అబద్ధాలపై ప్రజలకు అవగాహన కల్పించాలని, ప్రతి కార్యకర్త శక్తివంచన లేకుండా పనిచేస్తే మళ్లీ అధికారంలోకి వస్తామని ఆయన తెలిపారు. పార్టీనేతలు మాజీ ఎమ్మెల్యే కాసుని ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో పార్టీ మండల, పట్టణ కన్వీనర్లు కోట కృష్ణ, షేక్ సుభానీ, జిల్లా ఉపాధ్యక్షుడు షేక్ జాకీర్‌హుస్సేన్, ఎంపీపీ కందుల జాను, సీనియర్ నేతలు మందపాటి రమేష్‌రెడ్డి, కొప్పుల సాంబయ్య, నాయకులు షేక్ జానీభాషా, పాలే సుధీర్, షేక్ సైదావలి, షేక్ సుభానీ పాల్గొన్నారు.

ఏరువాక పౌర్ణమిని రైతు దినోత్సవంగా ప్రకటించాలి



నూజెండ్ల: రానున్న ఏరువాక పౌర్ణమి పురస్కరించుకొని ప్రభుత్వం ఉత్తమ రైతు పురస్కారాలు అందించాలని రైతు సంఘం పల్నాడు జిల్లా ప్రధాన కార్యదర్శి వి.రాము డిమాండ్ చేశారు. మండలంలోని గొల్లపాలెంలో ఆదివారం రైతులతో సమావేశం నిర్వహించారు. రాము మాట్లాడుతూ ఏరువాక పౌర్ణమి నాడు రైతులు వ్యవసాయ పనిముట్లకు పూజలు చేసి, పొలం పనుల్ని సంప్రదాయకంగా ప్రారంభిస్తారని తెలిపారు. అదే రోజు ఏరువాకను ప్రభుత్వం రైతు దినోత్సవంగా ప్రకటించి వ్యవసాయంలో ఎక్కువ దిగుబడులు తెచ్చిన యువ రైతులకు మండల స్థాయిలో ఉత్తమ రైతు అవార్డులు ఇవ్వాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో పెద్దారావు, అంజయ్య, సాంబశివరావు ,రైతులు పాల్గొన్నారు.

యోగాతో ఆరోగ్యం పదిలం



పిడుగురాళ్ల మార్కెట్ యార్డ్‌లో యోగా కార్యక్రమం



మున్సిపల్ కార్యాలయంలో యోగా నిర్వహిస్తున్న సీనియర్ సిటిజన్స్

పిడుగురాళ్ల: యోగాతో ఆరోగ్యం పదిలంగా ఉంటుందని యోగా గురువు అరవపల్లి రమేష్ తెలిపారు. పురపాలక సంఘం ఆధ్వర్యంలో అంతర్జాతీయ యోగా మాసోత్సవం సందర్భంగా పట్టణంలోని మార్కెట్ యార్డులో నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ యోగాను ప్రతిరోజు ఉదయాన్నే ధ్యానంతో చేస్తే ఆరోగ్యం అదుపులో ఉండటమే కాకుండా నలుగురికి ఆదర్శంగా నిలుస్తారని తెలిపారు. ప్రభుత్వం కూడా యోగాను ప్రోత్సహించడం ఎంతో అభినందనీయమని చెప్పారు.

యోగాతో మానసిక ఉల్లాసం

మాచర్ల రూరల్: యోగాతో సంపూర్ణ ఆరోగ్యం సాధ్యమని రిటైర్డ్ డెప్యూటీ డీఈఓ గాదె రామకృష్ణారావు అన్నారు. ఆదివారం పట్టణంలోని మున్సిపల్ కార్యాలయ ఆవరణలో యోగా మాసోత్సవాలను పురస్కరించుకొని సీనియర్ సిటిజన్స్ నిర్వహించిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. ఉద్యోగ బాధ్యతలు నిర్వహించి రిటైర్డ్ అయిన ఉద్యోగులకు యోగా వలన ఎంతో మానసిక ఉల్లాసం ఏర్పడుతుందని, సీనియర్ సిటిజన్స్ అంతా క్రమం తప్పకుండా ప్రకృతి సిద్ధమైన గాలి, ప్రశాంత వాతావరణంలో యోగా ప్రాక్టీస్ చేస్తే ఎంతో ఆరోగ్యకరంగా ఉంటారన్నారు. స్వామి వివేకానంద చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ మెట్టు గోవిందరెడ్డి మాట్లాడుతూ ఈ నెల 21న విశాఖలో జరగబోయే యోగా డే ని పురస్కరించుకొని నిర్వహించే కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ డి.వేణుబాబు, రిటైర్డ్ హెచ్ఎం ముత్యాల పాపిరెడ్డి పాల్గొన్నారు.

ఉపాధి కూలీలకు వెంటనే పనులు చూపించాలి



ఉపాధి హామీ కూలీలతో మాట్లాడుతున్న వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు

అమరావతి: స్థానిక బాబు జగ్జీవన్‌రామ్ కాలనీలోని ఉపాధి హామీకూలీలకు వెంటనే జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పనులను చూపించాలని వ్యవసాయ కార్మిక సంఘం పల్నాడు జిల్లా కార్యదర్శి జి.రవిబాబు అన్నారు. ఆదివారం స్థానిక బాబు జగ్జీవన్‌రామ్ కాలనీలో వ్యవసాయ కార్మిక సంఘం సభ్యత్వాన్ని ఇంటింటికి తిరిగి చేర్పించారు. ఈ సందర్భంగా జాతీయ గ్రామీణ ఉపాధి హామీ కూలీలు తమ సమస్యలను విన్నవిస్తూ కాలనీలోని ఉపాధి హామీ వేతన దారులు ఈ సంవత్సరం ఒక్కరోజు కూడా పనికి వెళ్లలేదన్నారు. క్షేత్ర సహాయకుడు పనికి రమ్మని అడిగినప్పుడు మిర్చి కోతల పనులు ముమ్మరంగా ఉండటం వలన వెళ్లలేకపోయామని, మిర్చి కోతలు అయిపోయిన తర్వాత పని చూపించాలని అడిగితే పనులు లేవని చెబుతున్నారన్నారు. ప్రస్తుతం వ్యవసాయ పనులు లేక ఉపాధి హామీ పనులు లేక నెల రోజుల నుంచి ఇంటి వద్దనే ఉంటూ ఇబ్బంది పడుతున్నామన్నారు. పని చూపించాలన్నారు. ఈ సందర్భంగా రవిబాబు మాట్లాడుతూ ఉపాధి హామీ వేతన దారులకు వారు అడిగినప్పుడు పని చూపించాల్సిన బాధ్యత సిబ్బందికి ఉంటుందన్నారు. అలా కాకుండా పనులు లేవని చెప్పటం సరికాదని వెంటనే అందరికి ఉపాధి హామీ పనులు చూపించాలని డిమాండ్‌చేశారు. అదేవిధంగా ఉపాధి హామీ జాబ్ కార్డు లేని వారికి జాబ్ కార్డులు వెంటనే ఇవ్వాలన్నారు. బాబు జగ్జీవన్‌రామ్ కాలనీ వాసులు పాల్గొన్నారు.

బాలికల హాస్టల్‌లో ప్రవేశాలకు దరఖాస్తులు ఆహ్వానం

వినుకొండ: కారంపూడి రోడ్డులో గల బీసీ బాలికల వసతి గృహంలో ప్రవేశాలకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు వార్డెన్ పి.రత్నకుమారి తెలిపారు.ఇంటర్, డిగ్రీ, ఒకేషనల్, పలు ప్రైవేటు కళాశాలల్లో చదువుతున్న విద్యార్థినులు, ఈబీసీ కేటగిరీకి చెందిన వారు కూడా అర్హులని పేర్కొన్నారు. ఈ నెల 30వ తేదీలోపు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. వివరాలకు 8639189463 నంబర్‌ను సంప్రదించాలని ఆమె కోరారు.

హిందూ హైస్కూల్‌లో షెడ్ నిర్మాణానికి విరాళం

అమరావతి: గత 75 సంవత్సరాలుగా అమరావతి పరిసర గ్రామాల్లో ఎంతో మందికి విద్యను అందించిన శ్రీరామకృష్ణ హిందూ హైస్కూల్‌లో విద్యాభ్యాసం చేసి ప్రస్తుతం అమెరికాలో స్థిరపడిన ప్రవాసాంధ్రుడు కోనూరు కోటేశ్వరరావు, వాణి దంపతులు పాఠశాలకు రూ.6లక్షలు విరాళమందించారు. పాఠశాలలో ఓపెన్ ఆడిటోరియం ఎదురుగా ఉండే ప్రదేశంలో షెడ్ నిర్మాణానికి ఈ నగదు వినియోగిస్తున్నట్లు పాఠశాల యజమాన్యం తెలిపింది.

సత్రశాలలో కృష్ణవేణి అమ్మవారి విగ్రహ ప్రతిష్ట



కృష్ణవేణి అమ్మవారి విగ్రహ ప్రతిష్టలో మాచర్ల ఎమ్మెల్యే జూలకంటి

రెంటచింతల: రాష్ట్రంలోనే అతి పురాతనమైన శైవ క్షేత్రంగా విరాజిల్లుతున్న సత్రశాల గంగా భ్రమరాంబ సమేత మల్లికార్జునస్వామి దేవస్థానం నుంచి పవిత్ర కృష్ణానదికి వెళ్లు మెట్ల వద్ద కృష్ణవేణి అమ్మవారి విగ్రహాన్ని వేదపండితులు శాస్త్రోక్తంగా ప్రతిష్ట క్రతువును నిర్వహించగా ఎమ్మెల్యే జూలకంటి బ్రహ్మానందరెడ్డి ఆదివారం ప్రతిష్ఠించారు. అనంతరం ఎమ్మెల్యే గర్భాలయంలో కొలువుతీరిన పరమేశ్వరుడుకు ప్రత్యేక పూజా కార్యక్రమాను నిర్వహించారు. తొలుత ఎమ్మెల్యేకు దేవస్థానం ప్రధాన అర్చకులు పూర్ణకుంభం, మంగళ వాయిద్యాలతో ఘనంగా స్వాగతం పలికారు. దేవస్థానం ఆవరణలో కూటమి నేతలతో కలిసి వివిధ రకాల మొక్కలు నాటారు. కార్యక్రమంలో ఎండోమెంట్ ఈఓ గాదె రామిరెడ్డి, పార్టీ మండల అధ్యక్షులు సీహెచ్ అబ్బిరెడ్డి, మాజీ వైస్ ఎంపీపీ గొంటు సుమంత్‌రెడ్డి, పార్టీ నాయకులు గొట్టం శ్రీనివాసరెడ్డి, లింగా పున్నారావు, బి.రామకృష్ణ, మున్నా ప్రభురాజు, అల్లం బ్రహ్మారెడ్డి, నీలం మల్లయ్య, ఎస్.నర్సింహారావు, సత్రశాల కార్తికమాసం అన్నదాన కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

ఎన్నాళ్లకెన్నాళ్లకు..



పూర్వ గురువులతో 2011-2012 బ్యాచ్ పదో తరగతి విద్యార్థులు

రెంటచింతల: స్థానిక సెయింట్ జోసఫ్స్ ఉన్నత పాఠశాలలో 2011–2012 విద్యా సంవత్సరంలో పదో తరగతి చదివిన విద్యార్థులు ఆదివారం పాఠశాల ఆడిటోరియంలో ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. కరస్పాండెంట్ ఫాదర్ గోవిందు బాలస్వామి, హెచ్ఎం దుర్గాప్రసాద్, ఆనాడు తమకు విద్యాబుద్ధులు చెప్పిన ఉపాధ్యాయులు తుమ్మా లూర్దురెడ్డి, కె. చిన్నపురెడ్డి, వై. ఫాతిమా మర్రెడ్డి, బి.థామస్‌లను ఘనంగా సత్కరించారు. విద్యార్థులంతా తమనుతాము వేదికపై పరిచయం చేసుకున్నారు. పూర్వమిత్రులను 13 సంవత్సరాల అనంతరం కలుసుకుని అప్పటి జ్ఞాపకాలను గుర్తు చేసు కోవడం ఎంతో సంతోషంగా ఉందని, ఉపాధ్యాయులు నేర్పిన నైతిక విలువల తోకూడిన విద్యకారణంగానే ఉన్నత స్థాయికి చేరుకున్నాని పుల్లా ఫ్రాన్సిస్ తెలిపారు.

ఎమ్మార్పీఎస్ కమిటీల ఎంపిక వేగవంతం

- జూలై 7న అన్ని గ్రామాల్లో ఎమ్మార్పీఎస్ జెండా ఆవిష్కరణలు
- ఎమ్మార్పీఎస్ రాష్ట్ర అధికార ప్రతినిధి దుడ్డు రామకృష్ణ మాదిగ



మాట్లాడుతున్న దుడ్డు రామకృష్ణ మాదిగ

క్రోసూరు: మాదిగ రిజర్వేషన్ పోరాట సమితి, అనుబంధ సంఘాల మండల సమావేశం నందిగామ దేవదాస్ మాదిగ అధ్యక్షతన ఆదివారం క్రోసూరులో జరిగింది. ఎమ్మార్పీఎస్ రాష్ట అధికార ప్రతినిధి, పల్నాడు జిల్లా ఇన్‌చార్జి దుడ్డు రామకృష్ణ మాదిగ ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. అభినవ అంబేడ్కర్, మహాజన నేత పద్మశ్రీ మందకృష్ణ మాదిగ ఆదేశాల మేరకు క్రోసూరు మండలంలోని 16 మాదిగ పల్లెల్లో ప్రతీ ఒక్క గ్రామ ఇన్‌చార్జిలందరూ ఇప్పటి నుంచే గ్రామ స్థాయిలో ఎమ్మార్పీఎస్, అన్ని అనుబంధ సంఘాల నూతన కమిటీ నిర్మాణాలను వేగవంతం చేయాలని, అదేవిధంగా ప్రతీ గ్రామంలో ఎమ్మార్పీఎస్ 31వ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా జూలై 7న ఎమ్మార్పీఎస్ జెండా ఆవిష్కరణలకు సిద్ధం చేయాలని పిలుపునిచ్చారు. ఎమ్మార్పీఎస్ క్రోసూరు మండల మాజీ అధ్యక్షుడు కొడవటి కృపారావు, వేమవరపు జీవన్ మాదిగ, బొక్కా జాన్‌పాల్ మాదిగ, గొర్రెపాటి స్వామి మాదిగ, దుద్దుల అక్కులు మాదిగ, చిలక రవి మాదిగ, రేపూడి ప్రభుదాస్ మాదిగ పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో ప్రతిష్టా మహోత్సవం

- ముత్యాలంపాడు ఆలయానికి పోటెత్తిన బక్తులు
- 40 వేల మందికి అన్న సంతర్పణ



ధ్వజ స్తంభాలు ప్రతిష్టిస్తున్న దృశ్యం



ప్రతిష్టించిన ధ్వజస్తంభాల వద్ద పూజలు చేస్తున్న మాజీ ఎమ్మెల్యే కాసు మహేష్‌రెడ్డి

దాచేపల్లి: దేవతమూర్తుల దేవాలయాలు.. విగ్రహాలు.. బొడ్రాయి, ధ్వజస్తంభాల ప్రతిష్టా మహోత్సవాలతో భక్తి పరవశించింది. దాచేపల్లి మండలం ముత్యాలంపాడులో భ్రమరాంబ సమేత మల్లికార్జునస్వామి, గంగాదేవి, మహలక్ష్మీ సహిత గ్రామ నాభిశిల, ప్రసన్నాంజనేయ స్వామి ప్రతిష్టా మహోత్సవాలు ఆదివారం కనుల పండువలా జరిగింది. సచ్చిదానంద సరస్వతి స్వామి ఆశీస్సులతో బ్రహ్మశ్రీ చల్లా శ్రీనివాసశర్మ పర్యవేక్షణలో ప్రతిష్టా మహోత్సవ కార్యక్రమాలను ఘనంగా నిర్వహించారు. ఈ నెల1వ తేదీ నుంచి ప్రతిష్ట పూజలు ప్రారంభించారు. ఆదివారం ఉదయం 5 గంటల నుంచే ప్రతిష్ట పూజలు ప్రారంభించటంతో భక్తులు వేలాదిగా పాల్గొన్నారు. దేవాలయాలు, ధ్వజస్తంభాలు, బొడ్రాయి, నవగ్రహాలను వైభవంగా ప్రతిష్ఠించారు. అనంతరం దేవతమూర్తుల శాంతి కల్యాణం జరిపించారు.

పోటెత్తిన భక్తులు

ముత్యాలంపాడులో దేవాలయాలు, విగ్రహాలు, బొడ్రాయి, ధ్వజస్తంభాల ప్రతిష్టా మహోత్సవంలో పాల్గొనేందుకు భక్తులు పోటెత్తారు. ముత్యాలంపాడుతో పాటుగా చుట్టూ పక్కల గ్రామాల ప్రజలు, భక్తులు భారీగా తరలివచ్చారు. మహోత్సవంలో పాల్గొని పూజలు చేశారు. నవధాన్యాలు ధ్వజస్థంబాల వద్ద వేసి పూజలు నిర్వహించారు. ధ్వజస్థంబాలు ప్రతిష్టించేందుకు భారీక్రేన్‌లను ఉపయోగించారు. ప్రతిష్ట సందర్భంగా ముత్యాలంపాడు ఊరంతా బంధువులు, భక్తులతో కిక్కిరిసింది. ప్రతిష్టకు వచ్చిన ఆడపడుచులకు చీరె, జాకెట్ కానుకగా కుటుంబ సభ్యులు అందజేశారు.

40 వేల మంది అన్న సంతర్పణ..

ముత్యాలంపాడులో దేవాలయాల ప్రతిష్ట సందర్భంగా మహా అన్న సంతర్పణ కార్యక్రమం చేపట్టారు. గ్రామస్థులందరూ కలిసికట్టుగా ఈ కార్యక్రమాలను చేపట్టారు. ప్రతిష్ట నేపథ్యంలో 40 వేల మందికిపైగా అన్నదానంలో పాల్గొన్నారు. భక్తులకు ఎటువంటి అసౌకర్యాలు కలకుండా కమిటీ సభ్యులు చర్యలు తీసుకున్నారు. భారీ సంఖ్యలో భక్తులు పాల్గొనటంతో అన్నదానం కార్యక్రమం సజావుగా జరిగేలా ఏర్పాట్లు చేశారు. దేవాలయాలను విద్యుత్ దీపాలతో అలంకరణ చేశారు.



ప్రతిష్ఠించిన ఆంజనేయస్వామి విగ్రహం

ప్రతిష్టా మహోత్సవంలో మాజీ ఎమ్మెల్యే కాసు పూజలు

మండలంలోని ముత్యాలంపాడు గ్రామంలో జరిగిన దేవాలయాలు, బొడ్రాయి, ధ్వజస్తంభాల ప్రతిష్టా మహోత్సవంలో గురజాల నియోజకవర్గ వైఎస్సార్ సీపీ సమన్వయకర్త, మాజీ ఎమ్మెల్యే కాసు మహేష్‌రెడ్డి ఆదివారం పాల్గొన్నారు. గ్రామ పొలిమేరల నుంచి కాసుని మేళతాళాలతో గ్రామంలోకి తీసుకెళ్లారు. ప్రత్యేక పూజలు నిర్వహించారు. కమిటీ సభ్యులు, గ్రామపెద్దలు కాసుని శాలువా, పూలదండలతో ఘనంగా సత్కారించారు. కార్యక్రమంలో పార్టీ రాష్ట అదనపు కార్యదర్శి ఎనుముల మురళీధర్‌రెడ్డి, వైద్యుల విభాగం రాష్ట అధికార ప్రతినిధి డాక్టర్ చింతలపూడి అశోక్‌కుమార్, ఎంపీపీ కందుల జాను, జెడ్పీటీసీ మూలగొండ్ల కృష్ణకుమారి, జెడ్పీటీసీ మాజీ సభ్యుడు మూలగొండ్ల ప్రకాష్‌రెడ్డి, మార్కెట్‌యార్డు మాజీ చైర్మన్ గొట్టిముక్కల పెద హనిమిరెడ్డి, నాయకులు మందపాటి రమేష్‌రెడ్డి, కొప్పుల సాంబయ్య, కొమ్మినేని వెంకటేశ్వరరావు (కేవీ), కోట కృష్ణ, షేక్ సుభానీ, షేక్ జాకీర్ హుస్సేన్, సర్పంచి నెమలికంటి వెంకటచారి, ఎంపీటీసీ పాస వెంకటనాగయ్య పాల్గొన్నారు.

వైభవంగా అద్దంకమ్మ తల్లి జాతర



శావల్యాపురం: మండలంలోని చినకంచర్లలో గల శ్రీ అద్దంకమ్మ తల్లి కొలుపుల జాతర ఆదివారంతో ముగిసింది. మహిమ కల్గిన తల్లి జాతరను గ్రామస్తులు భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఈనెల 6న ప్రారంభమైన ఉత్సవాల చివరి రోజు ఉదయం దేవాలయ ప్రాంగణంలో మహిళలు పొంగళ్లు పొంగించి అమ్మవారికి సమర్పించారు. పసుపు–కుంకుమ నూతన వస్త్రాలను అందజేశారు. సాయంత్రం పండుగ వాతావరణంలో కులమతాలు పార్టీలకు అతీతంగా బోనాలను తలపై పెట్టుకొని అమ్మవారికి సమర్పించారు. కుంకుమ బండ్లను ఊరేగింపుగా మేళతాళాల నడుమ గ్రామంలో ఊరేగించి అమ్మవారికి సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. ఈ సందర్భంగా అమ్మవారి మూల విరాట్‌ను పట్టు వస్త్రాలు, పూలదండలతో అలంకరణ చేశారు. దేవాలయాన్ని విద్యుత్ దీపాలు, పూలదండలతో ప్రత్యేకంగా ముస్తాబు చేశారు.